నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)ను నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అర్జీలను కలెక్టర్ కార్యాలయంలో, రెవెన్యు డివిజనల్, మున్సిపల్, మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో అందించొచ్చన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జెసి, ఇతర జిల్లా అధికారులు, డివిజన్ పరిధిలో రెవెన్యూ, డివిజనల్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు, తహశీల్దార్, ఎంపిడిఒ, ప్రత్యేక అధికారులకు, ఇతర మండల స్థాయి అధికారులకు అర్జీలు అందించాలన్నారు. అర్జీదారులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టరేట్ వద్దకు రానక్కర్లేదని, మండల స్థాయిలో నిర్వహించే పిజిఆర్ఎస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు.

సామాన్యునికి కూరగాయాలు

- కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి
- అదుపులోకి రాని అల్లం ధర
- కొత్తిమీరదీ అదే దారి...



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అమ్మో... ఇంత రేటా... మార్కెట్‌కు వెళ్లిన ప్రతి సామాన్యుడి నోటా కూరగాయల ధరలను చూసి వస్తున్న మాటలివి. సాధారణంగా ఒకటి రెండు రకాల కూరగాయల రేట్లు మాత్రమే ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం అలా కాదు... అన్ని కూరగాయల ధరలూ చుక్కలను చూపిస్తున్నాయి. పెరిగిన కూరగాయల ధరలతో సామాన్యుడి బడ్జెట్ తలకిందులైంది.

సాధారణంగా వేసవిలో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. సాగు తక్కువగా ఉండటం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆ పరిస్థితి నెలకొంటొంది. కాని ఈ ఏడాది వర్షాకాలంలోనూ ధరలు దిగిరాని పరిస్థితి. వాతావరణ ప్రతికూలతలు, వానలు, వరదలతో పంటలను కోల్పోవడంతో పాటూ దళారుల వల్ల కూరగాయల రేట్లు మండిపోతున్నాయి.

రైతు బజారు ధరతో పోల్చితే బహిరంగ మార్కెట్లో కిలోకు సుమారు రూ. 20పైనే విక్రయాలు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు నాణ్యత పేరుతో అదనపు ధరలకు విక్రయిస్తున్నారు. ఇవి కూడా ఒక్కోప్రాంతంలో ఒక్కోరంగా ఉన్నాయి. రైతు బజార్లలో కూరగాయల నాణ్యత నేతి బీరచందంగా మారడంతో చేసేది లేక బహిరంగ మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు.

బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం ఉల్లి కేజీ రూ.75కి చేరింది. అల్లం రూ.160, చిక్కుళ్లు కిలో రూ.120కి అమ్ముతున్నారు.

దొమ్మేరు రకం వంకాయలు కిలో రూ.60 వరకూ విక్రయిస్తున్నారు. బీరకాయలు రూ.60, టమోటా రూ.60, బెండకాయలు రూ.50, దొండకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.60, బంగాళాదుంపలు రూ.50, క్యారట్ రూ.60, క్యాప్సికం రూ.60, బీట్‌రూట్ రూ.60కి అమ్ముతున్నారు.

రైతు బజార్‌లో ధరలు ఈ విధంగా ఉన్నాయి. బీరకాయలు కిలో రూ.38, బెండకాయలు రూ.28, బంగాళాదుంపలు రూ. 32, వంకాయలు రకాలు వారీగా రూ. 36-48, టమాటా రూ.36 చొప్పున ఉన్నాయి. ఇక చిక్కుళ్ల రకాలు వారీగా రూ.60 నుంచి రూ.90 వరకూ పలుకుంది. బీట్‌రూట్ రూ. 30, క్యారెట్ రూ. 32, అరటికాయలు 3 రూ.20, ఆకు కూరలు అయితే రెండు కట్టలు రూ.10లు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో రకంపై కిలో రూ.20 నుంచి రూ.30ల పైనే విక్రయిస్తున్నారు. కిలోకు ఒక రేటు, అర కిలోకు మరో రేటు, పావు కిలో అయితే ఇంకో రేటు ఇలా ధరల్లో వ్యత్యాసం ఉంది.

కొత్తిమీర కొరకొర...

కొత్తిమీర ధర కొరకొర మంటోంది. వ్యాపారులు కొత్తిమీరను పెద్దపెద్ద కట్టల లెక్కన కొనుగోలు చేసి వాటిని పెద్ద, చిన్న కట్టలుగా కట్టి మార్కెట్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం 130 కట్టలు రూ.3,600 నుంచి రూ.3,800ల వరకూ ధర ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లు, రైతుబజార్లలో బెంగుళూరు కొత్తిమీర మాత్రమే అందుబాటులో ఉంది. గతంలో కొత్తిమీర కట్ట రూ.10 ఉండేది. కొన్ని సందర్భాల్లో రూ.5 కూడా విక్రయించేవారు. ఇప్పుడు రూ.10లకు కనీసం రెండు రెమ్మలు పెట్టడం లేదు. ప్రస్తుతం కొత్తిమీర కట్ట రూ.60 పలుకుతోంది. జిల్లాలోని తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామ పరిసరాలు కొత్తిమీర, ఆకుకూరల సాగు అధికంగా జరుగుతోంది. అక్కడ పంట చేతికి రావాలంటే మరో నెలరోజులైనా పడుతుందని చెబుతున్నారు. ఆకుకూరల ధరల పరిస్థితి కూడా ఇలానే ఉంది. చుక్కకూర, మెంతికూర పెద్దగా మార్కెట్లోకి రావడంలేదు. తోటకూర, పొనగంటి కూర, బచ్చలికూర, గోంగూర మాత్రమే దొరుకుతున్నాయి.

జిల్లాలో 15 వేల హెక్టార్లలో కూరగాయల సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 32,500 ఎకరాల్లో,రబీ సీజన్‌లో 75 వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరుగనుంది. రంగంపేట, సీతానగరం, కోరుకొండ, పెరవలి, ఉండ్రాజవరం తదితర మొత్తం 10 మండలాల్లో కూరగాయలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో డిమాండ్‌కు సరిపడా కురగాయల సాగు కావడం లేదు. సాగుకు ప్రణాళికలు రూపొందించి వివిధ రకాల కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచాల్సి ఉంది.అలాగే జిల్లా వాతావరణ పరిస్థితులకు తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసి రైతులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రైతులకు విత్తనాల ఎంపికలో అవగాహన లేకపోవడంతో దిగుబడులు తగ్గి నష్టాల పాలు కావాల్సి వస్తోందంటున్నారు. కొన్ని సార్లు చీడపీడలు ఆశించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, కూరగాయల సాగు జోలికి వెళ్లడం లేదంటున్నారు..

మూడు నెలలుగా ఇదే పరిస్థితి

గత 3 నెలలుగా కూరగాయల ధరలు తగ్గడంలేదు. ఏది కొన్నాలన్నా రూ.50పై మాటే. రూ.200 వెచ్చించినా నాలుగు రకాలు రావడం లేదు. బహిరంగ మార్కెట్లో ధరలు మరింత అదనంగా ఉన్నాయి. రైతు బజార్లలో కూరగాయల నాణ్యత కొరవడుతోంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి. ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. సామాన్యులకు కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- కె.రామకృష్ణ కొనుగోలుదారుడు, రైతు బజారు నటరాజ్ సెంటర్

మాట్లాడుతున్న రవీంద్రనాథ్

ఎల్ఐసిలో ప్రభుత్వ వాటా ఉపసంహరణ తగదు

ఎస్‌సిజడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎల్ఐసిలో ప్రభుత్వ రంగ వాటాలను ఉపసంహరించుకోవాలనే ఆలోచనను కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు విరమించుకోవాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎస్‌సిజడ్ఐఇఎఫ్) ప్రధాన కార్యదర్శి టివిఎన్ఎస్.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. వివిఎల్.పురం మోడల్ కాలనీలోని ఎల్ఐసి ఉద్యోగుల భవనం(వి.సుగునాకర రావు భవనం)లో ఐసిఇయు రాజమండ్రి డివిజన్ 27వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంతో రవీంద్రనాథ్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఏటా డివిడెండ్ రూపంలో వేల కోట్ల రూపాయలను ఎల్ఐసి అందిస్తుందన్నారు. అంతే కాకుండా లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడిగా సమకూరుస్తుందన్నారు. ఇలాంటి సంస్థలో ప్రభుత్వ వాటాలను ఉపసంహరించుకోవాలనుకోవడం సరి కాదన్నారు. మరో వక్త ఎస్‌సిజడ్ఐఇఎఫ్ అధ్యక్షులు పి.సతీష్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలన్నారు. ఎల్ఐసి ప్రీమియంపై విధిస్తున్న జిఎస్‌టిని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రారంభోత్సవ సభలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి 250 మందికి పైగా ఎల్ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు. ఎల్ఐసి రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్, పిఅండ్ఐఆర్ మేనేజర్, క్లాస్-1 ఆఫీసర్స్ ఫెడరేషన్ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, ఏజెంట్స్ అసోసియేషన్స్, సిఐటియు నాయకులు, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్, ఒబిసి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. విఆర్ఎస్ తీసుకొని ఉద్యోగ విరమణ పొందిన ఐసిఇయు రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబును ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం ప్రతినిధుల సభ, 2024-25 సంవత్సరానికి ఐసిఇయు రాజమండ్రి డివిజన్ ఆఫీస్ బేరర్ల ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా ఎస్ఆర్‌జె. మాథ్యూస్, ఉపాధ్యక్షులుగా ఐవి.సుధాకర్, జి.శ్రీనివాసరావు, సిహెచ్.సత్యదేవ, ప్రధాన కార్యదర్శిగా ఎం.కోదండరామ్, జాయింట్ సెక్రటరీలుగా పిఎస్ఎన్.రాజు, ఎ.సుబ్బారావు, ఎం.రామకృష్ణ, కోశాధికారిగా వి.ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఎంఎల్ఎలు రఘురామకృష్ణంరాజు, నానాజీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెరవలి

భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని చించేసిన ఉండి ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు, కాకినాడలో దళిత వైద్యునిపై దాడికి దిగిన ఎంఎల్ఎ పంతం నానాజీలపై సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి నంది రమేష్, అసెంబ్లీ కన్వీనర్ వెన్నపు సుధాకర్, జిల్లా ఇన్‌ఛార్జి ఏలూరి అశోక్‌కుమార్, చల్లాబత్తుల సత్యనారాయణ, చిర్రా రాజు, బి.జాన్, పి.చిరంజీవి తదితరులు డిమాండ్ చేశారు. 'మాది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటించి రోజు గడవక ముందే కూటమి ప్రజాప్రతినిధులు దళితులపై దాడులకు దిగడం శోచనీయమన్నారు. చట్టప్రకారం నడుచుకుంటామని ప్రమాణం చేసిన ప్రజా ప్రతినిధులు చట్టాన్ని గౌరవించకుండా చేతుల్లోకి తీసుకుంటే, దళితులు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంటనే ఎంఎల్ఎలపై చర్యలు తీసుకోవాలని, లేకుండే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

24న పెరవలి మండల సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిపి కె.సీతారాంప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జడ్‌పిటిసి, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ నిడదవోలు మండల కార్యవర్గం

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కృషి చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. నిడదవోలు బిసి కళ్యాణ మండపంలో ఆదిఆవరం యుటిఎఫ్ మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు జిల్లా అధ్యక్షులు పి.జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి రూపస్, ఎఫ్ డబ్ల్యు ఎస్ కార్యదర్శి ప్రకాష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయ గౌరీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జయకర్ మాట్లాడారు. జిఒ 117, 85, 84, 128లతో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత ప్రభుత్వ చేసిన అనాలోచినత నిర్ణయాలతో విద్యారంగం కుదేలైందన్నారు. పేద విద్యార్థులు బడికి దూరమవుతున్నారని తెలిపారు. ఎన్ఇపి ప్రభుత్వ విద్యా రంగానికి గొడ్డలి పెట్టుగా మారిందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం దీన్ని వ్యతిరేకిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం దీన్ని అమలు చేస్తున్నాయన్నారు. విద్యారంగనిపుణులతో చర్చించకుండా నిరంకుసత్వంగా అమలు చేస్తున్న ఎన్ఇపిపై పురాలో చించాలని కోరారు. అనంతరం నిడదవోలు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కెఎస్‌విపి. కుమార్, సహాధ్యక్షులుగా మేకా శ్రీనివాస్, అధ్యక్షులుగా అయినాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా, కనికెల్లి ప్రదీప్ కుమార్, కోశాధికారిగా జి.శివకుమార్, మహిళా సహాధ్య క్షులుగా పిఎస్ఎల్.క్రాంతి, కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిల ర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ ఎంవిసిహెచ్. కరుణ్‌కుమార్, జి.ఆనంద్‌మోహన్, ఎ.జోసెఫ్, డి.శ్రీనివాస్, భీమారావు, ఎస్.రాజేంద్రనాథ్, పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పార్థసారథి, కొప్పుల వెంకటేశ్వరరావు, సురేష్ బాబు, ఆకాశం శీను, రమేష్ బాబు ఏడుకొండలు, రాధికకుమారి, లిల్లీ గ్రేస్, బేగం, రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షునిగా వేణు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షునిగా మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు, వైసిపి సిఎసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైసిపి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళా రెడ్డి తదితర నాయకులు సమక్షంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. గూడూరి శ్రీనివాస్ ఆయనకు పెన్నును జ్ఞాపికగా ఇచ్చారు. పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు వేణుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

స్వర్ణాంధ్ర-2027లో భాగస్వామ్యం అవ్వండి

రాజమహేంద్రవరం రూరల్ : స్వర్ణాంధ్ర-2047 కోసం ప్రజలు, విజ్ఞులు, విభిన్న రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపే వ్యక్తులు, సంస్థల తరపున ప్రతినిధులు, విద్యార్థులు అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వడం ద్వారా స్వర్ణాంధ్ర సాధనలో పాలుపంచుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మహోన్నత లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధానంలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నారన్నారు. అందులో తూర్పు గోదావరి జిల్లా లోని అన్ని వర్గాలకి చెందిన వారు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి, మీ పేరు, ఫోన్ నెంబర్, ఈ మెయిల్, ఇతర వివరాలు పొందు పరచాల్సి ఉందన్నారు. మీ మొబైల్‌కి వచ్చే ఒటిపి నమోదు చేసి, ప్రశ్నావళిలో ఇచ్చిన ప్రతిపాదనలను మీ ఐచ్ఛికం లేదా మీ అభిప్రాయాన్ని తెలియ జేయాలన్నారు. పూర్తిగా ప్రశ్నావళి పూర్తి చేసిన తదుపరి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫోటోతో కూడిన సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. వాటిని డౌన్లోడ్ చేసుకుని ఉచితంగా పొందొచ్చన్నారు.

27న పర్యాటక రంగంపై పోటీలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రపంచ పర్యాటక దినోత్సవం-2024ను పురస్కరించుకుని 'పర్యటక అంశం'పై తూర్పుగోదావరి జిల్లా స్థాయి పోటీలను సెప్టెంబరు 27న నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలోని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. వక్తృత్వం, క్విజ్, వీడియో రీల్, ఫోటోగ్రఫీ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఔత్సాహిక యువతీ, యువకులు ఈ పోటల్లో పాల్గొనొచ్చన్నారు. జిల్లాలో పర్యటక ప్రదేశాల ప్రశస్తి తెలియ చేసేందుకు వక్తత్వం, క్విజ్, ఒక నిమిషం వీడియో 5μ-30 రీల్, ఫోటోగ్రఫీ కేటగిరి పోటీలు ఉంటాయన్నారు.

నన్నయ యూనివర్శిటీ క్యాంపస్‌లో సెప్టెంబరు 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఎన్‌టిఆర్ కన్వెన్షన్ హాల్లో పర్యాటకం మరియు శాంతి, సుస్థిర ప్రయాణాలు, కలకాలం జ్ఞాపకాలు అంశంపై ఆంగ్లం లేదా తెలుగులో పోటీలు ఉంటాయన్నారు. ప్రదర్శనకు సంబంధించి 5 నిమిషాల కాల వ్యవధి ఇస్తారన్నారు. పాల్గొనే వారు ఎన్‌టిఆర్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. పర్యాటకం- తూర్పు గోదావరి జిల్లా అనే అంశంపై ఒక నిమిషం రీల్ పోటీలు ఉంటాయన్నారు. వీడియో/రీల్‌లో కవర్ చేసే మతపరమైన పర్యాటక, ప్రధాన పర్యాటక గమ్యస్థానాలు" అంశంపై ఎ4 షీట్‌లో వివరాలు భౌతికంగా అందజే యాలన్నారు. వీడియో క్లిప్స్ edrjy@aptdc.in, apta@ap.gov.in మెయిల్ చేయాలన్నారు.

ప్రతి కేటగిరీ నుంచి ఒక నామినేషన్ చొప్పున ఒక కాలేజీ నుంచి నాలుగు గరిష్ఠంగా నామినేషన్లు మాత్రమే అంగీకరిస్తామన్నారు. ఈ మేరకే కళాశాలలు విద్యార్థులను పం పాలని పర్యటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు కోరారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటలవరకూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం ఎన్.ఉదయభాస్కర్ (9182301625), పి.వెంకటాచలం(6309942025), బి.అన్వర్‌హుస్సేన్(9121725757), కె.సురేష్‌కుమార్ (7036530828)లను సంప్రదించాలన్నారు.

యజమాని సంతకం లేకుండా కైలుదారు కార్డులివ్వాలి

చాగల్లు : భూ యజమాని సంతకం లేకుండా సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని, వాస్తవ కౌలుదారుడుని గుర్తించి పంట రుణం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు చాగల్లులో పర్యటించిన ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. అలాగే చాగల్లు శివాలయం నుంచి చిక్కాల వెళ్ళే మార్గంలో అడ్డు పుంతరోడ్డు నుంచి ఊనగట్ల, అమ్మికుంట, కలవలపల్లి 4 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. చాగల్లు మెయిన్ రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలో బస్ షెల్టర్ పునర్నిర్మాణం చేయాలని, చాగల్లు పసివేదల మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలపై ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

విఒఎలకు వేతనాలు చెల్లించాలి

గోపాలపురం : పెండింగ్‌లో వేతనాలను వెంటనే చెల్లించాలని విఒఎలు కోరుతున్నారు. మండలంలో సుమారు 53 మంది విఒఎలు వెలుగు సెర్ప్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పనిచేస్తున్నామని తెలిపారు. తమకు నెలకు రూ.8వేలు చెల్లిస్తున్నారన్నారు. ఇది కూడా ఏడు నెలలుగా నిలిపేశారన్నారు. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పిల్లలకు ఫీజులు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్నామని వాపోయారు. ఏడు నెలలుగా అప్పులు చేసి గడిపామని, ఇప్పుడు కొత్తగా అప్పులు కూడా పుట్టడం లేదన్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎంఆర్‌పికి మించి కొనరాదు

ఉండ్రాజవరం : ఏవైనా వస్తువులను ఎంఆర్‌పి ధరలకు మించి కొనుగోలు చేయరాదని కొవ్వూరు డివిజన్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జివి.ప్రసాద్ వినియోగదారులకు సూచించారు. మండలంలోని చౌక డిపోల్లో కాటాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల వంట నూనెల ధరల్లో వచ్చిన వ్యత్యాసం కారణంగా ప్రతి వినియోగదారుడు తప్పనిసరిగా ప్యాకింగ్‌పై ముద్రించిన ధరలకే కొనుగోలు చేసేలా అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలోని మొత్తం 40 డిపోల కాటాల సీలింగ్ రెన్యువల్ అయినట్లు ఆయన తెలిపారు.ప్రతి దుకాణదారు కాటాలను సకాలంలో సీలింగ్ చేయించుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ బి.సత్యనారాయణ ఉన్నారు.

కార్టూ'నిజం'



కొప్పిశెట్టి కుటుంబానికి ఎంఎల్ఎ గోరంట్ల పరామర్శ

ప్రజాశక్తి - కడియం

ఇటీవల పితృవియోగానికి గురైన కొప్పిశెట్టి శ్రీనివాస్, శేషగిరి, జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యం సోదరులను రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదివారం పరామర్శించారు. కొప్పిశెట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొప్పిశెట్టి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రైతు నాయకులుగా, శ్రీ లక్ష్మీగణపతి ఆలయ కమిటీ సభ్యునిగా శ్రీరాములు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఎంఎల్ఎ వెంట వెలుగుబంటి నాని, కడియం సిఐ వెంకటేశ్వరరావు, ఎఎస్ఐ వెంకటరమణ, చిలుకూరి వెంకటేశ్వరరావు, నవత వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో ఎపిఆర్‌జెసి విద్యార్థుల సత్తా

గోకవరం : జగ్గంపేట మండలం రాజపూడిలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్‌జిఎఫ్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో భూపతిపాలెం ఎపిఆర్‌జెసి విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 26 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్-19 విభాగంలో విద్యాసాగర్, అండర్-17లో లోవ రాజు, చైతన్య, యోగి, ఖోఖోలో రామనాయుడు, అఖిల్, అనిల్, అండర్-14లో ముగ్గురు, యోగా అండర్-14లో నలుగురు సత్తాచాటారు. అథ్లెటిక్స్ విభాగం పరుగు పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజయం సాధించిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన పిఇటి సుధాను ప్రిన్సిపల్ బి.రవి, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు కాకినాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కడియం : ఉచిత వైద్య శిబిరాలను పేదలకు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదివారం కడియపులంకలో నూతనంగా ఏర్పాటు చేసిన 'లియా డయాగ్నొస్టిక్ సెంటర్'ను, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గోరంట్ల ప్రారంభించారు. వైద్యులు పి.సూర్యతేజ, సిహెచ్.ఆరతి, పి.పవన్‌కిషోర్, ఎం.గంగిరెడ్డి, కెవిఎస్.రామకృష్ణ వైద్య సేవలు అందించారు. సుమారు 300 మంది రోగులు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారని నిర్వాహకులు జి.గోవింద్ తెలిపారు.

ముళ్లపూడికి పితృవియోగం

నల్లజర్ల : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి ముళ్లపూడి వెంకటరత్నం శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా బాపిరాజు కుటుంబాన్ని పెండ్యాల అచ్చిబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు పరామర్శించారు. వెంకటరత్నం చిత్రపటానికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. స్థానిక ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు వెంకట్రావు భౌతికయంపై పూలమాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల మండల అధ్యక్షులు చోడసాని బాపిరాజు, దేవరపల్లి మండలం ఉపాధ్యక్షులు చప్పటి శివనాగ ప్రసాద్, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాల జనసేన పార్టీ నాయకులు ఫణి, సత్తిబాబు, అనిశెట్టి మధు, పోలుమాటి నాని, ఉన్నమట్ల సత్య, కిషోర్, వివేక్, సెంథిల్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

చాగల్లు : నేలటూరు, మల్లవరం గ్రామాల్లో ఆదివారం టిడిపి నాయకులు, సర్పంచ్ యడ్లపల్లి రజని ఇంట్లో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్రెల శ్రీధర్, ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెండ్ల శ్రీరామ్‌చౌదరి, కూటమి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేశారు. వంద రోజుల్లో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల శ్రీరామచౌదరి, కరుటూరు సతీష్, నందిగం శ్రీను, కె.రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి-రాజోలు: రాజోలు మండలం శివకోడు మెరకపాలెంలో పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్ కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి రూ.3,350 నగదు సీజ్ చేసి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాజోలు స్టేషన్ పరిధిలోని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు (పేకాట, గుండాట, కోడిపందేలు) నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు బయటకు తెలియజేయమని ఎస్ఐ తెలిపారు.

నేడు సఫాయి సురక్ష మెడికల్ క్యాంపులు

ప్రజాశక్తి-అమలాపురం

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సఫాయి సురక్ష మెడికల్ క్యాంపులు జిల్లాలోని అన్ని నియోజక వర్గ హెడ్ క్వార్టర్స్ లో సోమవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీలలో పనిచేసే పారిశుధ్య కార్మికులందరికీ ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలులు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇస్తారని అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్ లోని ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించే ఆసుపత్రుల వివరాలు

1. అమలాపురం-ఏరియా ఆసుపత్రి, 2. కొత్తపేట-సామాజిక ఆరోగ్య కేంద్రం, 3.రాజోలు-సామాజిక ఆరోగ్య కేంద్రం, 4.ముమ్మిడివరం-సామాజిక ఆరోగ్య కేంద్రం, 5. పి గన్నవరం-సామాజిక ఆరోగ్య కేంద్రం, 6. మండపేట-సామాజిక ఆరోగ్య కేంద్రం, 7. రామచంద్రపురం-ఏరియా ఆసుపత్రి ఆసుపత్రి (రామచంద్రపురం).

ఆత్రేయపురంలో 'స్వచ్ఛతాహి సేవ'

ప్రజాశక్తి-ఆత్రేయపురం

స్థానిక గ్రామ సచివాలయము వద్ద ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బండారు గ్రామ రావి చెట్టు సెంటర్ వద్ద అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. స్వచ్ఛతా హి సేవా ర్యాలీ లో పాల్గొని పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ స్టిక్కర్ అంటించి, కరపత్రం ద్వారా కూటమి ప్రభుత్వం వందరోజులలో చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు.

నేడు ఆత్రేయపురంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సెప్టెంబర్ 23 సోమవారం కొత్తపేట డివిజన్ ఆత్రేయ పురం మండల కేంద్రంలో ఉద యం 10 గంటల నుంచి జరుగుతుందని కొత్తపేట డివిజన్ అధికారులు ఆత్రేయపురంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కూడా ఆత్రేయపురం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కావున మండల పరిధి లోని అర్జీదారులు తమ సమస్యలను డివిజన్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చి తగు పరిష్కార మార్గాలు పొందాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు..

నేడు అమలాపురంలో..

అమలాపురం: జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సెప్టెంబర్ 23 సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి నిర్వహిస్తారని కలెక్టరేట్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని వారు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

క్రీడా పోటీలకు 260 మంది ఎంపిక

ప్రజాశక్తి- తాళ్లరేవు

ముమ్మిడివరం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు మండలం నుంచి 260 మంది ఎంపికైనట్లు మండల స్థాయి క్రీడా పోటీల కోఆర్డినేటర్ విఆర్కె తంబి తెలిపారు. తాళ్లరేవు మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో కబడ్డీ నుంచి 48, ఖోఖో నుంచి 48, వాలీబాల్ నుంచి 48 మంది ఎంపికయ్యారు. చెస్ 8, షటిల్ బ్యాడ్మింటన్ 8, యోగ 20, అథ్లెటిక్స్ నుంచి 80 మంది విద్యార్థులు మొత్తంగా 260 మంది నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు తంబి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఎంఇఒలు మోకా ఉమా, మంగాయమ్మ అభినందించారు.

పంచాయతీ గోడపై పోస్టర్ కలకలం

ప్రజాశక్తి-పెదపూడి

మండల డ్వాక్రా ఎపిఎం చినబాబు, యానిమేటర్లపై ఆరోపణలు గుప్పిస్తూ కరకుదురు గ్రామపంచాయతీ ప్రధాన ద్వారం వద్ద గోడపై గుర్తు తెలియని వ్యక్తులు అంటించిన పోస్టర్ మండల వ్యాప్తంగా కలకలం రేకెత్తిస్తోంది. మండల వ్యాప్తంగా ఉన్న 1700 డ్వాక్రా గ్రూపుల నుంచి 2022 నుంచి ప్రతి సభ్యురాలి నుంచి రూ.2500ల చొప్పున యానిమేటర్స్ వసూలు చేస్తున్నారని డ్వాక్రా లోన్ తీసుకునే గ్రూప్ నుంచి పది వేలు వసూలు చేస్తున్నారుని, స్త్రీనిధి లోన్ మంజూరుకు చేయడానికి రూ.10 వేలు వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. శ్రీనిధి లోన్ చెల్లించే క్రమంలో చివరి వాయిదా యానిమేటర్స్ తీసుకుంటున్నారని అడిగితే సిసి చినబాబు రూ.20 వేలు తీసుకుంటున్నారని పలు ఆరోపణలు చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పోస్టర్ను అంటించారు.

వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి కృషి

మార్కెటింగ్ శాఖ అధికారి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రైతుల అవసరాల దష్ట్యా వ్యవసాయ మార్కెట్ కమిటీలను అభివృద్ధి చేసేందుకు మరిన్ని ప్రణాళికలతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఫామ్ మార్కెటింగ్ కార్యక్రమం అమలు జరుగుతోందన్నారు. కమిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేసిందన్నారు. రూ.3 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చిందన్నారు. రైతులకు మద్దతు ధర లేనపుడు ఈ నిధుల ద్వారా మద్దతు ధర కల్పిస్తారన్నారు. త్వరలో రైతులకు ఉపయోగపడేలా బహుళార్థ ప్రయోజనాలు కల్పించనుంది.'ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మార్కెటింగ్ శాఖ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వెల్లడించారు.

జిల్లాలో ఎన్ని మార్కెట్ కమిటీలు ఉన్నాయి.?

జిల్లాలో 9 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కాకినాడ అర్బన్, కరప, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో ఉన్నాయి. గతంలో కొన్ని మార్కెట్ కమిటీలు రెండేసి నియోజకవర్గాల్లో ఉండేవి. పాలనా పరంగా ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు ఒక్కో నియోజకవర్గానికి ఒక మార్కెట్ కమిటీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పాలక వర్గాల సమక్షంలో ప్రతి నెలా ధరల స్థిరీకరణపై సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం.

జిల్లాలో రైతుబజార్ల నిర్వహణ ఎలా ఉంది.?

రైతులు తాము పండించిన పంటలను దళారీలు, మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేసింది. కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్ పెద్దాపురంలలో మూడు రైతు బజార్లు నిర్వహణలో ఉన్నాయి. ప్రస్తుతం కాకినాడలో తూరంగి, రాజీవ్ గహకల్ప రైతుబజార్ల నిర్మాణం జరుగుతోంది. త్వరలో వీటిని పూర్తి చేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తాము. ప్రస్తుతం జిల్లాలో కరప, ఏటిమొగ, ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, రమణయ్యపేట ఆరు ప్రాంతాల్లో కొత్త రైతు బజార్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ల దశలో ఉన్నాయి.

రైతుబజార్ల ఆధునికీకరణ జరుగుతుందా.?

ఇప్పటికే రైతు బజార్లను అన్ని విధాలా అభివద్ధి చేశాం. ప్రభుత్వం త్వరలో కేటాయించనున్న నిధులతో ఆయా బజార్లను ఆధునికీకరిస్తాం. కొన్ని రైతుబజారుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే ఈ రైతు బజారులో పర్సులు, సెల్ఫోన్లు చోరీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు రైతుబజార్లలో సిసి కెమెరాల ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుంది. అలాగే కాకినాడ నగరపాలక సంస్థలో రెండు మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసాం.

జిల్లాలో ఎన్ని గొడౌన్లు ఏర్పాటు చేశారు.?

ప్రస్తుతం జిల్లాలో 16 గోదాముల ఉన్నాయి. ఇవి 15,055 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ప్రస్తుతం 7 గోదాములు నిండి ఉన్నాయి. కేంద్రం పథకం అయిన అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలో పలు సంతలను అభివద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

మార్కెట్ సెస్సు, చెక్ పోస్టుల ద్వారా వసూళ్లు ఏ మేరకు వస్తున్నాయి?

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ సెస్సు రూ.3550.78 లక్షలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.1319.48 లక్షలు వసూలైంది. 16 చెక్ పోస్టుల ద్వారా వసూళ్లు జరుగుతున్నాయి.

మార్కెటింగ్ శాఖలో ఖాళీలు ఎన్ని ఉన్నాయి.?

జిల్లావ్యాప్తంగా 77 మందికి గానూ 22 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 75 మంది వరకూ పనిచేస్తున్నారు. జూనియర్ మార్కెట్ సూపర్ వైజరు నుంచి మార్కెట్ కమిటీ కార్యదర్శి వరకూ ఖాళీలు ఉన్నాయి.

లింకు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయా.?

ఎపి అగ్రికల్చరల్ మార్కెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా పంచాయితీరాజ్ శాఖ ద్వారా జిల్లాలో 69 లింక్ రోడ్ల నిర్మాణం కోసం రూ.3763.39 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించాము. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లింకు రోడ్ల నిర్మాణం కోసం అనుమతి మంజూరు చేస్తూ ఇప్పటికే జీవో విడుదల అయింది. పంచాయతీరాజ్ శాఖ పనులను త్వరలో పూర్తి చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసింది.

అభివృద్ధి కమిటీ చైర్మన్లతో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ కో-చైర్మన్లుగా జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రతిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అటు గిరిజన, ఇటు మైదాన ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందిస్తూన్న ఏలేశ్వరం ఆసుపత్రి వైద్యుల సేవలు అభినందనీయం అన్నారు. ఏలేశ్వరం ఆసుపత్రి అభివృద్ధికి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామని నూతన కో-చైర్మన్లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎతో పాటు టిడిపి నాయకులు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే 65వ వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలకు చెందిన కరపత్రం ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ మాట్లాడుతూ అక్టోబర్ మూడో తేదీ నుండి 12వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు నువ్వుల వెంకట్రాజు, టివివి.సత్యనారాయణ, సూర్య చంద్రరావు, టి.సాంబశివరావు, ఆచంట సత్యనారాయణ, తోటకూర రాంబాబు, మావుళ్ల మాచరరావు పాల్గొన్నారు.

బాల సాహిత్యంపై పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాలల సభలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలసాహిత్యంలో కథలు చదివారు. నచ్చిన కథ' భయపెట్టిన చిలుకను విద్యార్థులు నాటకీకరణ చేసి ప్రదర్శించారు. కథలోని భాషతో భాషా నైపుణ్యాలు సమీక్షలు, ఉక్తలేఖనంలో చక్కని ప్రతిభ కనబరిచారు. కథలోని సన్నివేశాలతో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు అంగర గోపాలకృష్ణ బహుమతులు అందజేశారు.

మల్లిశాలలో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిశాల గ్రామంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన మంచి పనులను వివరించారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా భారం అయినా సరే పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4000కు పెంచారని, డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గ్రామసభల్లో చర్చించి ఎస్టిమేట్లు తయారు చేసి వెంటనే అభివద్ధి పనులు ప్రారంభించే విధంగా చేశారన్నారు. ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ అవరోధాలను అవకాశాలుగా మార్చుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వంద రోజుల పాలన దిగ్విజయంగా సాగిందన్నారు.

వ్యర్థాలతో వస్తువుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

వ్యర్థ పదార్థాలతో వివిధ వస్తువుల తయారీపై అధికారులు విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో స్వచ్ఛత మహోత్సవాల్లో బాగంగా ఆదివారం సామర్లకోట రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో స్టేషన్లో స్వచ్ఛతాహీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు కళ్యాణి, రామకృష్ణ, సంతోష్, గిరి, శ్రీధర్, శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల

గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-యంత్రాంగం

కూటమి ప్రభుత్వం వంద రోజులు పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే విధంగా గ్రామాలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

కపిలేశ్వరపురం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండలంలోని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.కార్యక్రమంలో కూటమి నాయకులు ముత్యాల వెంకట్రావు, పుచ్చల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, పలు గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు, ఎంపిడిఒ కొండలరావు, తహశీల్దార్ పి చిన్నా రావు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు :** రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు విజయవంతంగా పూర్తవడంతో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఆదివారం రాజోలు మండలం పొన్నమండ గ్రామంలో సర్పంచ్ కుక్కల బేబి సరోజని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి పరిశీలకులు చిటికెల రామ్మోహన్ రావు, డిపిఒ డి.రాంబాబు, మాజీ ఎంఎల్ఎ మానేపల్లి అయ్యాజీవేమా, ఎంపిడిఒ ఎన్.బాలాజీ, ఎంపిపి కేతా శ్రీనువాస్,రెడ్డి అనంతలక్ష్మి, తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, ఇఒపిఆర్డి జి.భీమారావు, నాయుకులు తదితరులు పాల్గొన్నారు **అయినవిల్లి :** ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం అయినవిల్లి మండలంలో వెలువలపల్లిలో ఆదివారం నిర్వహించారు. అధికారులు పార్టీ నాయకులు ప్రజలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం లో టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు బడుగు భాస్కర్ జోగేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో టిడివి, జనసేన నాయకులు అందే సత్యనారాయణ, చింతా వనముల రావు, నిల్లా సూర్యనారాయణ, బడుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన కపిలేశ్వరపురం మండలం పరిధిలోని నిడసనమెట్ట, అంగర, కోరుమిల్లి, కేదార్లంక ,గ్రామాలకు చెందిన ఏడుగురికి సిఎం సహాయనిధి ద్వారా మంజురైన రూ.4,26,484 విలువగల చెక్కులను ఆదివారం మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ చేతుల మీదుగా కపిలేశ్వరపురం గ్రామపంచాయితీ వద్ద బాధిత కుటుంబాలకు ఆదివారం అందజేశారు . ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కలిపిస్తుందన్నారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు.

విశ్రాంత భవన నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులు విశ్రాంతి తీసుకునేందుకు నూతనంగా నిర్మించబోయే విశ్రాంతి భవన నిర్మాణానికి దాత విరాళం అందజేశారు. విశాఖపట్నంకు చెందిన రాయవరపు సూర్యనారాయణ, సత్యవేణి దంపతుల కుమారుడు రాయవరపు రాము దంపతులు ఆదివారం రూ.15 లక్షల 31 వేల విరాళాన్ని ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ కు అందజేశారు. డిసి మాట్లాడుతూ యాత్రికుల సౌకర్యార్థం మాస్టర్ ప్లాన్ ప్రకారము త్వరలోనే కాటేజెస్ దాతల సహకారంతో విశ్రాంత గదుల నిర్మాణం చేపడతామన్నారు.

హైస్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు

కరప : పెద్దాపురప్పాడు జెడ్పి హైస్కూల్ ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న తరుణంలో నిర్వహించబోయే డైమండ్ జూబ్లీ వేడుకల్ని పూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ నాయకులు కోరారు. ఆదివారం పెద్దాపురప్పాడు హైస్కూల్లో ఆడహక్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దేవు సదానందమూర్తి, తదితర నాయకులు మాట్లాడారు. త్వరలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హైస్కూల్ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పలు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొండా సూర్యనారాయణ (చంటిబాబు), వర్కింగ్ ప్రెసిడెంట్ కాకర్లపూడి సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి చిక్కం రామచంద్రరావు పాల్గొన్నారు.

రఘురామపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

అంబేద్కర్ ఫ్లెక్సీని చింపి అవమానపరిచిన రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. రాజ్యాంగం ద్వారా ఎన్నికైన ఎంఎల్ఎ అంబేద్కర్ ఫ్లెక్సీ ధ్వంసం చేయడం దారుణమన్నారు. ప్రపంచమంతా అంబేద్కర్ విగ్రహాలు పెట్టి ఆయనను ప్రపంచమేధావిగా గుర్తిస్తుంటే భారతదేశంలో ఉన్న కొందరు మాత్రం ఆయనను ఒక దళితుడిగానే చూడడం చాలా దారుణమన్నారు.

ఎస్ఐ బదిలీ ఆపాలంటూ ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట పట్టణ ఎస్ఐ మురళీమోహన్ బదిలీ ఆపాలంటూ పలువురు ధర్నా చేపట్టారు. ఎస్ఐ బదిలీని నిలుపుదల చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన మురళీమోహన్ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించారన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ఎన్నికల ముందు నుంచి శక్తి మేరకు కృషి చేశారన్నారు. అందర్నీ కలుపుకొని ఎటువంటి సమస్యలు, విద్వేషాలు, వివాదాలు లేకుండా విధులు నిర్వహించారన్నారు. అటువంటి పోలీసు అధికారి వేరే చోటికి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బాబీ, వెంకటలక్ష్మి, పలువురు పట్టణ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఆలమూరు

మడికిలో దివంగత డాక్టర్ సింగలూరి కావ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. డాక్టర్ సింగలూరి కావ్య జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని లంక గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు సత్యానందరావుకు కావ్య కుటుంబ సభ్యులు వివరించారు. ఈ విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కావ్య మెమోరియల్ ట్రస్ట్ వారిని, సేవలు అందిస్తున్న వైద్యులను, సిబ్బందిని సత్యానందరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, మెర్ల గోపాలం, నాగిరెడ్డి వెంకటరత్నం, అడ్డాల సత్యనారాయణ రాజు, మల్యాల రాజేష్, ఈదల రమేష్, కొత్తపల్లి కష్ణ, కొత్తపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కావ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ బండారు

పోలీసులతో వాగ్వాదం చేస్తున్న నాయకులు

ఉద్రిక్తతల నడుమ శెట్టిబలిజ సంఘం సమావేశం వాయిదా

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత మూడు నెలలుగా తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం ఘర్షణల మధ్య ఉద్రిక్తతలు, వాదోపవాదాల మధ్య వాయిదా పడుతుంది. తాజాగా ఆదివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం తీవ్ర ఉద్రతలకు దారితీసింది. సంఘ గౌరవ అధ్యక్షులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతుండగా టిడిపికి చెందిన పలువురు సభ జరగకుండా అడ్డుపడ్డారు. ఈ నేపథ్యంలో ఆదివారం గౌరవాధ్యక్షులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన ఏర్పడిన సమావేశం ఉద్రిక్త పరిస్థితులు మధ్య మళ్లీ వాయిదా పడింది. రెండు వర్గాలు కుర్చీలతో బాహాబాహి కి దిగడం తో ముందస్తు సమాచారం ఉన్న రామచంద్రపురం డిఎస్పి రామకష్ణ 40 మంది పోలీసులు 60 మంది ఎఆర్, ఎఎన్ఎస్ సిబ్బందితో పాటు రామచంద్రపురం సిఐ అశోక్ కుమార్, మండపేట సీఐ దొర రాజు, ద్రాక్షారం ఎస్సై లక్ష్మణ్, ఏ గంగవరం ఎస్ఐ జానీ భాష, మండపేట రూరల్ ఎస్సై సురేష్ బాబు, రాయవరం ఎస్సై బుజ్జి బాబు ఆధ్వర్యంలో అల్లరి మొక్కలను చెదరగొట్టారు. దీంతోపాటుగా శెట్టిబలిజం భవనానికి తాళం వేసి రెండు రోజులు పాటు ఏ విధమైన సభలో సమావేశాలు జరగకుండా ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం పట్నంలో సెక్షన్ 30 అమలులో ఉంటుందని ఏ విధమైన సభలో సమావేశాలకు అనుమతులు లేవని ఈ సందర్భంగా డిఎస్పి రెండు వర్గాలకు సూచించారు.

ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నం

శెట్టిబలిజల్లో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తుండటంతో వివాదాలు చోటుచేసుకుంటున్నాయని రాజ్యసభ సభ్యులు తాలూకా శెట్టిపల్లి సంఘం గౌరవ అధ్యక్షులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన ఆదివారం జరిగిన సమావేశం వాయిదా పడటంపై మీడియాతో మాట్లాడారు. సమావేశం ఘర్షణ వాతావరణం దశ్య వాయిదా వేయడం జరిగిందని మళ్లీ 15 రోజుల్లో సర్వసభ్య సమావేశం జరుగుతుందని అప్పటివరకు తాత్కాలిక అధ్యక్షుడిగా సంఘానికి నరాల ఏడుకొండలు. వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.173/2023
Between:
దౌర్ల జయ మరియు వగైరాలు ...వాదులు
మరియు
దౌర్ల రోస్మేరి మరియు వగైరాలు ...ప్రతివాదులు
To ప్రతివాదులు:
D2: Dowrla Magdani Mery @ Snehitha, D/o. లేటు నెల్సన్, వయస్సు 54 సం॥లు, డో.నెం. 3-25-6/ఎ, వార్డు నెం.6, వినాయక గుడి వద్ద, రేచర్లపేట, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
D3: Dammu Sathibabu, S/o. Not known, వయస్సు 54 సం॥లు, డో.నెం.3-8-35, గుర్రాలవారి వీధి, వార్డు నెం.7, రేచర్లపేట, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
పై నెంబరు దావాలో 2వ మరియు 3వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.**04-10-2024** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియపర్చుకో వలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కె. జాన్ జోసఫ్
అడ్వకేట్, వెంకటరత్నాపురం, కాకినాడ
సెల్: 7702946663

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
A.S.210/2014
బిట్వీన్:
పచ్చల శ్రీరాములు(డైడ్)అండ్ ఒథర్స్ ...అప్పిలెంట్స్
అండ్
గింజల అప్పన్న @ మోహన్ కుమార్ అండ్ అథర్స్ ...రెస్పాండెంట్స్
R8. గింజల సత్యవతి W/o సూర్య నారాయణ, 60 yrs, గొల్ల వీధి, చిత్రాడ, పిఠాపురం మండల్,PTPJCJ
R.9. గింజల చంద్ర S/o సూర్య నారాయణ, 40 years, గొల్ల వీధి, చిత్రాడ, పిఠాపురం మండల్,PTPJCJ
R10. సాలిపల్లి అనంత W/o not known, D/o గింజల సూర్య నారాయణ, 30 years, గొల్ల వీధి, చిత్రాడ పిఠాపురం మండల్,PTPJC)
పై నెంబర్ అప్పీల్ లో మీరు నోటీసు తీసుకోనందున శ్రీ కోర్ట్ వారు మీకు సబ్స్టిట్యూటెడ్ సర్వీస్ గా పేపర్ లో వేయడం ద్వారా మీకు నోటీసు ఆర్డర్ వేసినారు. అప్పీలు వాయిదా ది. **04-10-24** వేసినారు కావున మీరుగాని మీ అడ్వకేట్ ద్వారాగాని పైకోర్టులో ఉదయం 10.30గం॥నిలకుహాజరు అయి మీ అభ్యంతరములు తెలియచేయవలెను లేనియెడల మీకు పరోక్షముగా తీర్పు చెప్పబడును.
బత్తిన లక్ష్మణ దొర
అడ్వకేట్, పిఠాపురం

CHANGE OF NAME
I, **SAYADHAAZI**, S/o. Sayad Baji, D.No. 31-10-38/1, Gantalamma Temple Street, Rajahmundry (Urban), E.G. District, A.P., I have changed my name from **SAYEDHAAZI** (Old Name) to **SAYADHAAZI** (New Name). Hence forth Iam being called **SAYADHAAZI** S/o. Sayad Baji for all purpose.

మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.40/2024 in FDP5/2024 in OS195/1990
Between:
దరిశిపూడి.విశ్వేశ్వర్రావు ...పిటీషనరు
మరియు
2. జనరల్ ట్రేడర్స్,పార్టనర్ షిప్ఫర్మ్ రిప్రజెంటెడ్ బై పార్టనర్ శ్రీమతి దరిశిపూడి సీతారత్నం W/o.భీమలింగం, 65సం॥ వ్యాపారం, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం తూ॥గో॥జిల్లా.
3. శ్రీమతి దరిశిపూడి సీతారత్నం W/o.భీమలింగం, 65సం॥ వ్యాపారం,సా॥ 5వ అంతస్తు, రోహిణి టవర్స్, కవాటసంఖ్య 5/26,సీతయ్య గారి తోట, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
4. దరిశిపూడి సుభాష్ S/o.భీమలింగం, వయస్సు 47సం॥.సా॥ 5వ అంతస్తు, రోహిణి టవర్స్, కవాటసంఖ్య 5/26,సీతయ్య గారి తోట, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
5. దరిశిపూడి అన్నపూర్ణ D/o.భీమలింగం, వయస్సు 45సం॥ సా॥5వ అంతస్తు, రోహిణి టవర్స్, కవాటసంఖ్య 5/26,సీతయ్య గారి తోట, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
నోటీసు
పై నెంబర్ ఫైనల్ డిక్రి పిటిషన్లో దాఖలు చేసిన జప్తు పిటీషన్లో 2 to 5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు అమలు జరిగించుటకు ప్రయత్నములు చేసినప్పటికి, మీరు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం ది.**01-10-2024** సం॥తేదీ వాయిదా తేదీ అయి ఉన్నందున మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా కాని హాజరు అయి మీ యొక్క సంజాయిషీ తెలియచేయని యెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.
K.V.V.CHALAPATHI
V.S.KAMALA LAYA
పిఠాపురం Advocates
17-09-2024 9246697166,9848260426

మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
FDP5/2024 in OS195/1990
Between:
దరిశిపూడి.విశ్వేశ్వర్రావు ...పిటీషనరు
మరియు
2. జనరల్ ట్రేడర్స్,పార్టనర్ షిప్ఫర్మ్ రిప్రజెంటెడ్ బై పార్టనర్ శ్రీమతి దరిశిపూడి సీతారత్నం W/o.భీమలింగం, 65సం॥ వ్యాపారం, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం తూ॥గో॥జిల్లా.
3. శ్రీమతి దరిశిపూడి సీతారత్నం W/o.భీమలింగం, 65సం॥ వ్యాపారం,సా॥ 5వ అంతస్తు, రోహిణి టవర్స్, కవాటసంఖ్య 5/26,సీతయ్య గారి తోట, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
4. దరిశిపూడి సుభాష్ S/o.భీమలింగం, వయస్సు 47సం॥.సా॥ 5వ అంతస్తు, రోహిణి టవర్స్, కవాటసంఖ్య 5/26,సీతయ్య గారి తోట, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
5. దరిశిపూడి అన్నపూర్ణ D/o.భీమలింగం, వయస్సు 45సం॥ సా॥5వ అంతస్తు, రోహిణి టవర్స్, కవాటసంఖ్య 5/26,సీతయ్య గారి తోట, పిఠాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
నోటీసు
పై నెంబర్ ఫైనల్ డిక్రి పిటీషన్లో 2 to 5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిమార్లు నోటీసులు అమలు జరిగించుటకు ప్రయత్నములు చేసినప్పటికి, మీరు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం ది.**01-10-2024** సం॥తేదీ వాయిదా ఉన్నందున ఆ రోజు ఉదయం మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా కాని హాజరు అయి మీ యొక్క సంజాయిషీ తెలియచేయని యెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.
K.V.V.CHALAPATHI
V.S.KAMALA LAYA
పిఠాపురం Advocates
17-09-2024 9246697166,9848260426